సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

బాబా ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్వరరావు

సీతమ్మధార: స్థానిక చైతన్యనగర్‌లోని వినాయక, షిర్డీసాయిబాబా ఆలయంలో సప్తాయన ఆలయ సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వద్ద నేరాలు, దొంగతనాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సప్తాయన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

లలితా పీఠానికి వెండి ఊయల బహూకరణ


వెండి ఊయలను ఆవిష్కరిస్తున్న లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారి ఊంజల్ సేవకు భక్తులు వెండి ఊయలను కానుకగా సమర్పించారు. కొంత మంది భక్తులు కలిసి సుమారు మూడున్నర కిలోల వెండితో తయారు చేసిన వెండి ఊయలను లలితా పీఠానికి బహూకరించారు. బుధవారం ఉదయం కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా వెండి ఊయలను ఆవిష్కరించారు. కుర్తాళం పీఠపురోహితుడు మాచర్ల రమేష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజూ రాత్రి 8.45 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ జరుగుతుందని, ఇక నుంచి వెండి ఊయలలో ఈ సేవ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సెక్యూరిటీ రూమ్ ప్రారంభం


రూమ్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం విద్య తరంగిణి వద్ద నూతన సెక్యూరిటీ రూమ్‌ను బుధవారం ఉదయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. హాస్టల్ విద్యార్థినులకు మరింత భద్రత కల్పించేలా దీనిని ఏర్పాటు చేశారు. వర్షా కాలంలో సెక్యూరిటీ సిబ్బందికి సైతం ఉపయుక్తంగా నిలిచేలా గదిని తీర్చిదిద్దారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ వినుత, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, యూనివర్సిటీ ఇంజినీరింగ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీపీ సన్నాహాలు

మద్దిలపాలెం: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా క్రమబద్ధీకరణకు పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలోని పెద్ద జంక్షన్ మద్దిలపాలెంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి బుధవారం ఆయన పరిశీలించారు. ఇటు శ్రీకాకుళం, విజయనగరం, మధురవాడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే మార్గంలో బీఆర్‌టీఎస్ రోడ్డును, గురుద్వారా వైపు వెళ్లే జాతీయ రహదారిని.. అటు త్రీటౌన్ వైపు వయా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా గల రోడ్డును పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఎటువంటి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టాలని డీసీపీలు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచనలిచ్చారు.

జగనన్న సురక్షతో.. సువర్ణ పాలన

పాలనాపగ్గాలు చేపట్టిన నాటి నుండి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనునిత్యం పేదల సంక్షేమానికే పాటు పడ్డారు. అనేక పథకాలు రూపొందించి బడుగు, బలహీనవర్గాల ఉన్నతికి కృషి చేశారు. తాజాగా జగనన్న సురక్షతో లబ్ధిదారులకు కావలసిన ధ్రువపత్రాలు అందజేస్తూ.. పథకాలందని అర్హులను గుర్తించి.. వారికీ పథకాలు వర్తింపజేసేందుకు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు.

- సంక్షేమ పాలనతో సీఎం జగన్‌పై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 27వ వార్డులో 110 సర్టిఫికెట్ల పంపిణీ


లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార: జగనన్న సురక్షతో రాష్ట్రంలో సువర్ణ పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 27వ వార్డులోని మండావారి వీధి కమ్యూనిటీ హాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. వార్డులో 128 సమస్యలపై 110 పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాలు, పథకాలకు సంబంధించి సమస్య ఏదైనా జగనన్న సురక్ష ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని, జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల్లో నమ్మకం కలిగించిందని ఎమ్మెల్యే అన్నారు. నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, డీఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక విభాగం టీపీవో అనిత, 27వ వార్డు అధ్యక్షుడు సీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, స్టేట్ రోడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పద్మనాభ అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, మధు, అనిల్, శివారెడ్డి, అప్పలరెడ్డి, శ్రీను, కరుణాకర్‌రెడ్డి, కుమారి, మల్లేశ్వరి, వెంకటేష్, అశోక్, ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మహిళలు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార : గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మట్లాడుతూ గంగ వరం పోర్టు ఏర్పాటులో ఉద్యమ ప్రస్థానం ఉందని, దాన్ని విస్మరించి నేడు యాజమాన్యం వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి యాజమాన్యం వ్యవహరించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాల కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్‌కె రెహ్మాన్, జి.రాంబాబు, ఎం.డి. బేగం తదితరులు పాల్గొన్నారు.

28న వాణిజ్య సముదాయాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల పలు కల్యాణ మండపాలు, ఫిష్‌మార్కెట్, క్యాంటీన్‌కు ఈ నెల 28న జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జెడ్సీ శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జోనల్ కార్యాలయ ప్రాంగణంలో 31వ వార్డు టీఎస్సార్ వాణిజ్య సముదాయం, జోన్-4 జీవీఎంసీ కార్యాలయం వద్ద సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డు వద్ద గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం, జగదాంబ వాణిజ్య సముదాయం, 35వ వార్డు పాతబస్టాండ్ ఫేజ్-2 దుకాణాలు, 39వ వార్డు లక్ష్మీటాకీస్ వద్ద పద్మానగర్ వాణిజ్య సముదాయం, 47వ వార్డు రెల్లివీధి వాణిజ్య సముదాయం, జడ్జి కోర్టు ఎదురుగా ఉన్న వాణిజ్య సముదాయం, 37వ వార్డు అంబేడ్కర్ కల్యాణ మండపం, రెల్లివీధి ఫిష్‌మార్కెట్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల క్యాంటీన్‌ను బహిరంగ వేలం పాట ద్వారా ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పైన పేర్కొన్న తేదీల్లో జోన్-4 జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని జోనల్ కమిషనర్ తెలిపారు. మరిన్ని వివరాలకు జోన్-4 కార్యాయలయ పని వేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

డెంగ్యూ, మలేరియా కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

జిల్లా మలేరియా అధికారి తులసి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో తులసి

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల కట్టడికి సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నామని జిల్లా మలేరియా అధికారి తులసి తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్‌సర్వే చేపట్టి వైద్య పరీక్షలు, వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇసుకతోట, మధురవాడ, పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. ఆయా హెల్త్ సెంటర్లలో డెంగ్యూ, మలేరియా నిర్ధారణకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో వలంటీర్లు గుర్తించిన జ్వరపీడితులకు సచివాలయ ఏఎన్‌ఎంలు తక్షణ వైద్యపరీక్షలు చేసి, తగిన వైద్యం అందించాలని సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పరీక్షలు చేస్తున్న విధానాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పరిశీలించాలన్నారు. డెంగ్యూ ,మలేరియా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనల్లో దోమల లార్వాను గుర్తించి, తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించి, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రామినాయుడు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

‘తప్పుడు కేసులో ఇరికించి జైలుకి పంపారు’


మాట్లాడుతున్న పొన్నాడ శివకుమార్

డాబాగార్డెన్స్ : తనను తప్పుడు కేసులో ఇరికించి జైలుకి పంపారని స్వర్ణకారుడు పొన్నాడ శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓ మర్డర్ కేసులో తనను ఇరికించారని, వాస్తవానికి మర్డర్ కేసుకి, తనకు ఎటువంటి సంబంధం లేదనడానికి తన వద్ద ఉన్న వీడియోలే సాక్ష్యమని తెలిపారు. ప్రముఖ బంగారం వ్యాపారి, తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటరే అసలు హంతకుడని, ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న వీడియోలు తన దగ్గర ఉన్నాయన్నారు. అసలు హంతకుడి ద్వారా తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కేసులో ఐదేళ్లు జైల్లో ఉన్నానని పేర్కొన్నారు. ఆస్తుల విషయంలో తన కుటుంబంలో గొడవలు ఉన్నాయని, కొందరు తన తల్లిని చంపేసి తనను ఇరికించారని ఆరోపించారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు


కంచరపాలెం వద్ద తోపుడు బండిని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం: కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్డు కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశి జంక్షన్ వరకు తోపుడు బళ్లు, రాంగ్ పార్కింగ్ వాహనాలను తొలగించినట్టు సీఐ తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై సచివాలయ సిబ్బంది జరిమానాలు విధించారన్నారు. ద్విచక్ర వాహన చోదకులు సర్వీస్ రోడ్డులో సింగిల్ పార్కింగ్ చేయాలని, రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా డబుల్ లైన్‌లో పార్క్‌చేసిన కార్లు, ఆటోలపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సవ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని ఆయన తెలియజేశారు. డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐలు పాపారావు, ఉల్ హక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతం రెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

ఎంఎస్‌ఎఫ్-5లో చెత్త నిల్వ ఉంచొద్దు

కమిషనర్ సాయికాంత్ వర్మ


రోడ్డు విస్తరణపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జోన్-5 పరిధి తాటిచెట్లపాలెం ఎంఎస్‌ఎఫ్‌లో చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 3, 4, 5, 8 పరిధిలోని పాత జైల్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం, పెందుర్తి, సుజాతనగర్, దత్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. పాత జైల్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహ కూడలి పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలు, జైల్‌రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధి సుజాతనగర్‌లో పర్యటించి గిరిప్రసాద్ నగర్‌లో నూతనంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహనరావు, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

27న పురందేశ్వరి రాక

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 27న విశాఖ వస్తున్నట్లు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి విశాఖకు వస్తుండటంతో.. ఆమెకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పదాధికారులతో సమావేశం నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య సమక్షంలో స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి పురందేశ్వరికి స్వాగతం పలకాలని నిర్ణయించారు.

‘పొగడ్తల పురాణం’ పై ప్రసంగం



ప్రసంగిస్తున్న సాహితీవేత్త డాక్టర్ సూర్యారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సభలో సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు పొగడ్తల పురాణం అనే అంశంపై ప్రసంగించారు. పొగడ్త, ప్రశంస, స్తుతి, కీర్తించడం, శ్లాఘించడం, కొనియాడు ఇవన్నీ ఒకే అర్థాన్ని సూచిస్తాయని తెలిపారు. సందర్భం, స్థాయిని బట్టి పదాలు మారుతుంటాయన్నారు. మన దేవతలంతా స్తోత్ర ప్రియులేనని, మనకు అపారమైన స్తోత్ర సాహిత్యం ఉందన్నారు. రాజులను కీర్తిస్తూ కవులు కావ్యాలు అంకితం చేసేవారని గుర్తుచేశారు. శ్రీనాథుడు వివిధ సందర్భాల్లో పాలకులను స్తుతించి సన్మానాలు పొందిన ఉదంతాలు సాహిత్యాల్లో కన్పిస్తాయని తెలిపారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ దేవుని దగ్గర నుంచి సామాన్య మానవుని వరకు పొగడ్తలకు లొంగని వారు ఉండరన్నారు. రచయిత కె.జి.వేణు ప్రసంగాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, పేరి రవికుమార్, కొత్తూరి రమణ, రాంభట్ల నృసింహశర్మ, సిహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయే..

- రేపట్నుంచి దిబ్బలపాలెం, చందకవీధి గ్రామదేవతల ఉత్సవాలు


దిబ్బలపాలెం చదునుపట్టు వద్ద వెలసిన బంగారమ్మ


పితానిదిబ్బలో వేంచేసిన బంగారమ్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 25 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 21న మధ్యాహ్నం 2.30 గంటలకు అమ్మవారి పండగ చాటింపు నిర్వహించనున్నారు. గ్రామ పొలిమేర నుంచి పూజారమ్మను జగదాంబ జంక్షన్ సమీపాన గల యల్లమ్మ గుడి నుంచి దిబ్బలపాలెం గ్రామంలో గల చదును పట్టు వద్దకు ఆహ్వానించనున్నారు. సాయంత్రం 6 గంటలకు విజయనగరానికి చెందిన కళాకారులతో బుర్రకథ ఏర్పాటు చేశారు. 22 సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, 5 గంటల నుంచి సత్తమ్మ అమ్మవారికి పూజా కార్యక్రమాలు, చదునుపట్టు నుంచి బయలుదేరి దండు బజారు నుంచి మేళ తాళాలతో పితాని దిబ్బలో వెలసిన బంగారమ్మ గుడి వరకు పెద్ద ఎత్తున ఊరేగింపుగా వెళ్లి ఉపారం అందజేయనున్నారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా నిర్వహించనున్నారు. 23 సాయంత్రం 5 గంటలకు మరిడమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించి బంగారమ్మకు ఉపారం సమర్పించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు గ్రామ పురవీధుల్లో ఉజిడి బండి తిప్పనున్నారు. 24న తొలేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని చదునుపట్టు వద్ద బంగారమ్మకు ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఉదయం 9 నుంచి గ్రామ పురవీధుల్లో పూల ఘటాలు ఊరేగించనున్నారు. రాత్రి 7 గంటలకు కూటి ఘటాలు తిరగనున్నాయి. రాత్రి 7 గంటలకు రేలారేలారే జానపద, సినీ ఆర్కెస్ట్రా నిర్వహించనున్నారు. అమ్మవారి అనుపు కార్యక్రమం 25న పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు చదునుపట్టు వద్ద మేకపోతుకు శ్వాస ఎక్కించే కార్యక్రమం చేపట్టనున్నారు. 8 గంటలకు పోలమ్మ, ఎల్లమ్మ, బంగారమ్మకు పసుపు, కుంకుమ సమర్పించనున్నారు. 10 గంటల నుంచి గ్రామ పురవీధుల్లో పూల జంగిడి తిరగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు కూటి ఘటాలు తిరగనున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మంగళ వాయిద్యాలు.. మేళ తాళాలు, నేల వేషాలు, పులివేషాలు, సేవగరిడి, అమ్మవారి నృత్యాలు, బాణ సంచాతో అమ్మవారి ప్రభను వైభవంగా పితాని దిబ్బలో వెలసిన బంగారమ్మ ఆలయం వరకు ఊరేగించనున్నారు. మారువారం సందర్భంగా ఆగస్టు ఒకటిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 12 గంటలకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఇంత పెద్ద ఎత్తున నిర్వహించనున్న పండగ మహోత్సవాలకు పలువురు రాజకీయ ప్రముఖులు, ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు, సంఘ సేవకుల సహకారం ఉందని ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు. బంగారమ్మ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమయపాలన ముఖ్యం

- ఆరోగ్య సిబ్బందితో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరంలో బుధవారం గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు, సబ్ యూనిట్ అధికారులతో మలేరియా, డెంగ్యూ ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, కుటుంబ నియంత్రణ పాటించాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, డాక్టర్ సలహాలు పొందేలా చూడాలని సూచించారు. నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని క్లినిక్‌లలోనూ జరగాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ మాట్లాడుతూ ఫీవర్ సర్వేలో మలేరియా, డెంగ్యూ కేసులను గుర్తించి వెంటనే తెలపాలన్నారు. సమీక్షలో ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశ అభివృద్ధి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్య్రం అనంతరం నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశం అభివృద్ధి పథంలో ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, కార్మికుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టవద్దని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 888వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, విశాఖ ఉక్కు సంస్థపై పెట్టుబడి పెట్టి, పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com